

సార్వత్రిక ఎన్నికల్లో
సమర్థవంతంగా పనిచేద్దాం

- ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్
- పోలీసు, సెబ్, ఆర్టీఏ, అటవీశాఖ అధికారులతో సమన్వయ సమావేశం



కడప (క్రైం), జనవరి 12: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని విభాగాలు కలిసి సమర్థవంతంగా పనిచేద్దామని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలీసు, సెబ్, ఆర్టీఏ, అటవీశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. రాను న్న ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపడదామన్నారు. స్టాటిక్ చెక్‌పోస్టులు, డైనమిక్ చెక్‌పోస్టుల్లో సమన్వయంతో పనిచేద్దామన్నారు. బెల్టు దుకాణాలు జిల్లాలో ఉండకూడదన్నారు. అక్రమంగా నగదు, బంగారు ఆభరణాల తరలింపు కూడా జరగకూడదన్నారు. ఎన్‌డీపీఎల్, డీపీఎల్ నిబంధనల ప్రకారం సీజ్ చేయాలన్నారు. ఉన్నది ఉన్నట్లు సీజ్ చేసి, కేసు నమోదు, నిందితుల అరెస్టు అంతా చట్టపరంగా జరగాలన్నారు. నాటుసారా, గంజాయి సీజ్ చేయాలని ఆదేశించారు. పీడీ యాక్టు నమోదు చేయదగ్గర వారిని గుర్తించాలన్నారు. అటవీశాఖ పరిధిలోని మెటీరియల్ కూడా అక్రమంగా రవాణా జరగరాదన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో అదనపు ఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి డీటీసీ మురళి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు, అధికారులు మేల్కోవాలి



- ఎస్పీని దుర్భాషలాడిన రాచమల్లుపై కేసు నమోదు చేయాలి
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 12: వైసీపీ నేతల అరాచకాలపై పోలీసులు, అధికారులు ఇప్పటికైనా మేల్కోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఎస్పీని దుర్భాషలాడిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిపై సుమోటోగా కేసు న మోదు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం ద్వారకానగర్‌లోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రొద్దుటూరులో లిక్కర్‌ను పోలీసులు పట్టుకుంటే ఎమ్మెల్యే రాచమల్లు ఎస్పీని దుర్భాషలాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాచమల్లుపై సుమోటోగా కేసు నమోదు చేయాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇష్టానుసారంగా అధికారులను నిలబెట్టి వారి కుర్చీలో కూర్చుని మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహిస్తారని, వైసీపీ నేతలపై తిరగబడకుంటే రానున్న కాలంలో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఆ పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తితే వారే పోలీసుల ఇళ్లపై దాడులు చేస్తారని అనానరు. ఇటీవల సీఐపై జరిగిన దాడిని ఆయన గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ సెటలింగ్ యాక్టు-2022 తెచ్చిందన్నారు. ఈ జీవో భూకబ్జాలకు పాల్పడుతున్న వైసీపీ నేతలకు, నాయకులకు మేలు చేకూరుస్తుందన్నారు. రిజిస్టరులో భూహక్కుదారుడి పేరు ఒక్కసారి నమోదైతే అభ్యంతరంపై కోర్టుకు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. ఈ చట్టం వల్ల సామాన్యులు, రైతులు, దళితులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ చట్టం రద్దు చేస్తామన్నారు.

విద్యార్థిని హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు



జీవిత ఖైదీ పడ్డ ముద్దాయిలు

కడప రూరల్/గోపవరం జవనవరి 12: విద్యార్థిని హత్యకేసులో ముగ్గురికి జీవిత ఖైదు విధిస్తూ శుక్రవారం జిల్లా ప్రధాన జడ్జి తీర్పు వెలువరించారు. ఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. బద్వేలులోని ఓ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న బద్వేలు మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన గొడుగునూరు శిరీష (19) తనను ప్రేమించలేదని అట్లూరు మండలం చిన్నరాజుపల్లె గ్రామానికి చెందిన బాలరాజు చరణ్(22) ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో 18 జూన్ 2021న బద్వేలు మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన గొడుగునూరు నాయబ్ రసూల్(20), అట్లూరు మండలం మడవూరు గ్రామానికి చెందిన పేరుసోమల నరసింహ(20) అనే స్నేహితుల సహాయంతో పథకం ప్రకారం బద్వేలు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొలంలో శిరీషను కత్తితో 24 సార్లు పొడిచి హత్య చేశారు. శిరీష తండ్రి సుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ కేసు శుక్రవారం జిల్లా కోర్టులో తుది విచారణకు రాగా జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి సాక్షులను విచారించారు. నేరం నిరూపణ కావడంతో ముద్దాయి చరణ్‌కు 302 ఐపీసీ కింద జీవిత ఖైదుతో పాటు రూ.2వేలు జరిమానా, 354-డి ఐపీసీ కింద ఒక సంవత్సరం జైలుశిక్ష అలాగే రూ.1,000లు జరిమానా విధించారు. రెండవ, మూడవ ముద్దాయిలకు 302 రెడ్‌విత్ 109 ఐపీసీ కింద జీవిత ఖైదుతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున పీపీ ప్రతాప్‌కుమార్‌రెడ్డి వాదనలు వినిపించారు. త్వరితగతిన కేసు దర్యాప్తు చేసిన అప్పటి సీఐ రమేశ్, ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బందిని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అభినందించారు.

పోలీస్ పౌరుషం ఏమైంది ?



దివంగత ఐపీఎస్ అధికారి ఉమేష్‌చంద్ర జిల్లా ఎస్పీగా పనిచేసిన హయాంలో పోలీస్ అంటే అసాంఘిక శక్తులకు ఉచ్చ. డబ్బులకు మనుషులను చంపే హంతకులను.. మట్కా, పేకాట, బొమ్మబొరుసుతో సామాన్య కుటుంబాలను నాశనం చేస్తున్న వారిని ఉమేష్‌చంద్ర నిలువరించారు. కిరాయి రౌడీలను ఏరిపారేశారు. ఫ్యాక్షన్‌ను తరిమేశారు. ఏయ్ బిడ్డా.. ఇది నా అడ్డా అంటూ చొక్కాలు విప్పుకుని రొమ్ములు విరిచి తిరిగే వారిని మక్కెలిరగదన్ని లాకప్‌లో వేసి రౌడీషీట్లు నమోదు చేశారు. ఎంతటి నాయకుడైనా క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉంటే రౌడీషీట్లు నమోదు చేసేవారు. ఉమేష్‌చంద్ర రాక ముందు జిల్లాలో అరాచకం.. బాంబులు, కత్తులతో దాడులు.. రౌడీలు, హత్యలు, కిడ్నాప్‌లు.. ఎన్నికల్లో బూత్ క్యాప్చరింగ్.. ఓటుకు రానీయకుండా చేయడం జరిగేవి. అయితే ఉమేష్‌చంద్ర వచ్చిన తరువాత సీన్ రివర్స్. అప్పటి సీఎం చంద్రబాబునాయుడు పరిపాలన శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. అందుకే అప్పట్లో ఎస్పీగా పనిచేసిన ఉమేష్‌చంద్ర కడప జిల్లాలో ఫ్యాక్షనిస్టులు, రౌడీమూకలు, మట్కాబీటర్లు, ట్రబుల్ మాంగర్లులపై గురి పెట్టారు. పోలీసు అంటే అంత పవర్ ఉండేది. కానీ ఇప్పుడు.. పోలీసులంటే పాలక వైసీపీ నేతలకు లెక్కే లేదు. అక్రమాలను అడ్డుకునే పోలీసులపైనే దాడులకు తెగబడుతున్నారు. అయినా పోలీసులు నిస్సహాయులుగా ఉంటున్నారు. ఇది పోలీసు వర్గాలను కలవరపరుస్తోంది.

- వైసీపీ నేతలకు వత్తాసు పలికి చులకనగా మారిన వైనం
- కాపలాదారుల కంటే హీనంగా చూస్తున్న అధికార పార్టీ నేతలు
- పోలీసు అంటే వైసీపీ ప్రైవేటు సైన్యంగా మారిందన్న ఆరోపణ
- ప్రైవేటు సెటిల్‌మెంట్లలో కొందరు పోలీసుల అత్యుత్సాహం
- అందుకే నేడు పోలీసులపై దాడులు, దౌర్జన్యాలు, బూతు పురాణాలు
- మొన్న అల్లరి చేయొద్దంటూ హెచ్చరించిన సీఐని చితక్కొట్టారు
- ఇసుక అక్రమ రవాణా అడ్డుకున్నందుకు మహిళా ఎస్ఐపై రాళ్ల దాడి
- మద్యం బాటిళ్లు పట్టుకున్నందుకు సెబ్ ఎస్ఐపై ఎమ్మెల్యేబూతు పురాణం
- సీఎం జిల్లాలో ఖాకీలకు వరుస అవమానాలు
- పరువు పోతోందంటూ పోలీసుల ఆవేదన

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో పేకాట, మద్యం తాగి దొరికినా.. చిన్న చిన్న కేసుల్లో పట్టుబడినా.. మహిళలను వేధించినా, హత్య చేసినా ఇతరత్రా వాటిలో పోలీసులు కఠినంగా వ్యవహరించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. వైసీపీ నేతల నుంచి ఫోను వస్తే చాలు.. కొందరు పోలీసులు సెల్‌ఫోన్‌లోనే నమస్తే.. చెప్పి పెద్ద ఘటన జరిగినా కూడా కేసు కట్టకుండా వదిలేసి వైసీపీకి సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామస్థాయి నుంచి పోలీసులంటేనే వైసీపీకి ఊడిగం చేస్తారనే ధీమా ఉంది. అందుకే వారిని ఘోరంగా చూస్తారంటారు.

నిన్నటి టీడీపీ హయాంలో కూడా పోలీసులంటే జనాల్లో భయం ఉండేది. జగన్ సీఎం అయిన తరువాత భయం అటుంచితే పోలీసులపైనే దాడులకు తెగబడుతున్నారు. పైస్థాయిలో ప్రభుత్వ పెద్దలకు పోలీసులు ఎప్పుడు వన్‌సైడ్‌గా మారారో.. జిల్లా స్థాయిలో కూడా పోలీసులు వైసీపీ నేతలు చెప్పిందే చట్టం అన్నట్టుగా మారారనే విమర్శ ఉంది. ఒకప్పుడు పోలీసు అంటేనే జనం కోసం అనుకునేవారు. ఇప్పుడు వైసీపీ ప్రైవేటు సైన్యంగా మార్చారనే విమర్శ ఉంది. అందుకే వైసీపీ నేతల్లో కూడా పోలీసులంటే చాలా లైట్‌గా తీసుకున్నారు.

జిల్లాలో టీడీపీ నేతల పై వైసీపీ వారు ఫిర్యాదు చేస్తే క్షణాల్లో వారిని ఎత్తుకొచ్చి జైల్లో వేస్తారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మరికొందరు నేతలను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టిన సంగతి తెలిసిందే. మరి పోలీసులపైనే వైసీపీ నేతలు దాడి చేసినా పట్టించుకోవడంలేదని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

- నిబంధనలకు మించి మద్యం బాటిళ్లను తీసుకెళుతున్న ఓ వ్యక్తిని ప్రొద్దుటూరుకు చెందిన ఎస్ఈబీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అయితే వారిపై ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి స్టేషన్‌కు వెళ్లి మరీ దౌర్జన్యానికి దిగారు. ఎస్పీపై తీవ్ర పదజాలంతో దూషించడం మరోసారి జిల్లా పోలీసుల్లో చర్చనీయాంశంగా మారింది. జగన్ సీఎం అయిన తరువాత మద్యం చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ మూడు బాటిళ్ల మాత్రమే మద్యం అమ్మవలసి ఉంది. అయితే ప్రొద్దుటూరుకు చెందిన పుల్లయ్య 30 బాటిళ్ల తీసుకెళుతుండగా ఎస్ఈబీ ఎస్ఐ ఆలీబేగ్ బృందం అతన్ని పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకుంది. తన అనుచరుడ్ని విడిపించడం కోసం స్టేషన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే రాచమల్లు ఎస్ఈబీ పోలీసులపై విరుచుకుపడ్డారు.
- అన్నమయ్య జిల్లా రాయచోటిలో విజిలెన్స్ సీఐగా పనిచేస్తున్న అనిల్‌కుమార్‌కు కడపలోని కోఆపరేటివ్ కాలనీలో సొంత ఇల్లు ఉంది. ఈ ప్రాంతంలోనే వైసీపీకి చెందిన ఓ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు, ఎమ్మెల్యే పీఏకి చెందిన ఓ హోటల్ ఉంది. ఈ హోటల్‌లో ఒడిశా, అస్సాంకు చెందిన కార్మికులు పనిచేస్తుంటారు. సమీపంలో నివాసం ఉంటున్నారు. వీరితో కలసి శంకరాపురానికి చెందిన వైసీపీ గుంపు సీఐపై ఇటీవల దాడిచేయడం కలకలం రేపింది.
- ప్రొద్దుటూరు అంటేనే రెండో ముంబైగా పేరు. ముంబైతో సమానంగా ఇక్కడ ఓ ముఖ్యనేత ఆధ్వర్యంలో కొందరు వైసీపీ నేతలు అరాచకాలు చేస్తారనే ప్రచారం ఉంది. ప్రొద్దుటూరు పెన్నానది సమీపంలో కొందరు వైసీపీ ముఖ్య నేత అనుచరులు ఇసుకను అక్రమంగా తోలుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇలా అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న వన్‌టౌన్ ఎస్ఐ హైమావతిపై ఇసుకాసురులు రాళ్లతో దాడి చేయడం సంచలనంగా మారింది. ఈ ఘటనలో ఆమె జేబులోని సెల్‌ఫోను పగిలిపోవడంతో కాలికి గాయమైంది.
- గత ఏడాది మే, జూన్‌లో సీకేదిన్నె మండలంలోని కొలుములపల్లె గుట్ట నుంచి అనుమతి లేకుండా వైసీపీ నేతలు గ్రావెల్ రవాణా చేస్తున్నారు. దీన్ని అడ్డుకున్న అధికారులపై దాడి చేశారు. దీంతో సీకేదిన్నె పోలీసులు ఏఎస్ఐ సురేశ్‌ను అక్కడికి పంపగా వైసీపీకి చెందిన మల్లికార్జున ఏఎస్ఐపై దాడికి పాల్పడ్డారని చెబుతారు. అలాగే చెక్‌పోస్టు వద్ద కారును అడ్డుపెట్టగా తొలగించాలని కోరినందుకు ఓ ఏఎస్‌పై వైసీపీ నేత మల్లికార్జున దాడి చేయడం కలకలం రేపింది.
- ఓ ప్రేమ వివాహానికి సంబంధించి అమ్మాయి అబ్బాయి తరపున కుటుంబాలు సీకే దిన్నె పోలీస్ స్టేషన్ చేరుకున్నాయి. మీరు మీరు మాట్లాడుకోండి, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు. అయితే వారి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీయడంతో ఓ పోలీసు గొడవ వద్దంటూ సర్ది చెప్పగా.. మేం వైసీపీ వారం మీరెవర్రా అంటూ ఆయనపై దాడి చేసినట్లు సీకేదిన్నె పోలీసుసర్కిల్‌లో ప్రచారం ఉంది. ఇలా ఒక్క ఏడాదిలోనే పోలీసులు, మైనింగ్ అధికారులపై వైసీపీ మూకలు దాడి చేయడం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. పోలీసులు వైసీపీకి ఊడిగం చేస్తే చివరకు సామాన్య జనంలోనూ చులకనై పోతామని పలువురు పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వైసీపీ మూక దాడిలో గాయపడ్డ సీఐ అనిల్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

స్ఫూర్తినిస్తున్న సామాజిక సమత సంకల్పం

- జేసీ గణేశ్‌కుమార్



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జేసీ గణేశ్ కుమార్


కడప(కలెక్టరేట్), జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సామాజిక సమత సంకల్పం జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల్లో స్ఫూర్తిని నింపుతోందని జాయింట్ కలెక్టర్ గణేశ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్ప సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జేసీ ముందుగా అం బేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయనమాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిర్దేశించిన సా మాజిక న్యాయమార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపు నిచ్చారు. సామాజిక న్యాయానికి నిలువెత్తు ప్రతిరూపంగా విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ విగ్రహాన్ని ఈ నెల 19వ తేదీన సీఎం ఆవిష్కరిస్తారన్నారు. ఇందులో భాగంగా ఈనెల 9 నుంచి 19 వరకు సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లా అధికారులు ప్రభాకర్‌రెడ్డి, సరస్వతి, డాక్టర్ వెంకటసుబ్బయ్య, బ్రహ్మయ్య, ఆనంద్‌నాయక్, రమాదేవి, హిమదేవి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య శాఖలో రాయితీ విడుదల

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై)పథకం కింద రూ.50 లక్షల విలువ యూనిట్లకు రాయితీ మంజూరైందని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబరులో 5వ జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. చేప, రొయ్యల విలువ ఆధారిత కేంద్రాలకు రూ.20 లక్షలు, బతికిన చేపల విక్రయకేంద్రాలకు రూ.10 లక్షలు, సాధారణ చేపల అమ్మకం కేంద్రాలకు రూ.1.75 లక్షలతో పాటు ఫిష్ కియోస్క్ కేంద్రాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అర్హత మేరకు వారికి రాయితీలు విడుదలయ్యాయని కలెక్టర్ తెలిపారు.

చంద్రబాబు సభను
జయప్రదం చేయండి

- పుత్తా నరసింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం (కడప ఎన్టీఆర్ సర్కిల్), జనవరి 12: కమలాపురంలో ఈ నెల 19న నిర్వహించనున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సభను విజయవంతం చేయాలని పార్టీనాయకులు, కార్యకర్తలకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. కమలాపురంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో ఎన్నికలు రానుండటంతో ఈ సమావేశం అత్యంత కీలకమైనదన్నారు. మన నియోజకవర్గ టీడీపీ బలాన్ని నిరూపించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు, నారా లోకేశ్ పర్యటనలే ఇక్కడ విజయవంతం అయ్యాయన్నారు. దీంతో చంద్రబాబు ఈ సమావేశం కూడా కమలాపురంలో నిర్వహించాలని సూచించారన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి ఈ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఇందిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు శివారెడ్డి, ఖాదర్‌బాషా, పుత్తా యల్లారెడ్డి, నియోజకవర్గంలోని ఆరుమండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

డీఎస్సీ
ఉద్యోగాలెప్పుడు..?

- స్కూలు అసిస్టెంటు కేడరులో 39 మాత్రమే
- సర్‌ప్లస్ ఎస్జీటీ పోస్టులు 1,100 భర్తీలేనట్లే

కడప (ఎడ్యుకేషన్), జనవరి 12: జిల్లాలో డీఎస్సీకి సంబంధించి ఉపాధ్యాయ ఉద్యోగాలెన్ననే విషయం లో నిరుద్యోగుల్లో సందిగ్ధత నెలకొంది. మెగా డీఎస్సీ పై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ అభ్యర్థులకు నాలు గున్నరేళ్లుగా ఎదురుచూపులే మిగిలాయి. ప్రస్తుతా నికి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసినా నియామక ప్రక్రియ పూర్తయి కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చేసరికి సాధారణ ఎన్నికలు కూడా ముగుస్తాయని నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే ఇప్పట్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఉండదేమో అని ఆందోళన చెందుతున్నారు.

39 స్కూలు అసిస్టెంటు పోస్టులు ఖాళీ

జిల్లాలో స్కూలు అసిస్టెంటు కేటగిరిలో ప్రస్తుతం 39 ఖాళీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎస్జీటీ కేటగిరిలో దాదాపు 1,100కు పైగా ఖాళీగా ఉన్నా వీటన్నింటినీ మిగులు (సర్‌ప్లస్) పోస్టులుగా పరిగణిస్తున్నారు. ఇవి కాక మరో 113 ఎస్జీటీ పోస్టులు ఇటీవలే కర్నూలు జిల్లాకు షిఫ్ట్ చేశారు. అంటే ఈ ఎస్జీటీ పోస్టులు ఇక జిల్లాకు లేనట్లే. ఆ ప్రకారం టీచర్, విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని రిక్రూట్‌మెంటు చేపడితే జిల్లాలో సర్‌ప్లస్ ఎస్జీటీ పోస్టులుగా ఉన్న 1,100కు పైగా ఖాళీల భర్తీ అవసరం ఉండకపోవచ్చని తెలుస్తోంది. అయితే కొద్దిరోజుల క్రితమే మినిమం టైం స్కేలు (ఎంటీఎస్) విధానంలో డీఎస్సీ 1998 అభ్యర్థులకు కాంట్రాక్టు నియామకాలు చేపట్టారు. ఆ మేరకు ఎస్జీటీ పోస్టుల్లో కోత ఏర్పడిందని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో కొత్తగా డీఎస్సీ రిక్రూట్‌మెంటు చేపడితే జిల్లాలో స్కూలు అసిస్టెంటు, ఎస్జీటీ కేటగిరీల్లో చాలా తక్కువ సంఖ్యలోనే నియామకాలు ఉంటాయని అంటున్నారు.

ఒక్క డీఎస్సీ ప్రకటనా లేదు..

రాష్ట్ర విభజన తరువాత తొలిసారిగా 2014లో టీడీపీ ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించి భర్తీ ప్రక్రియ కూడా పూర్తిచేసింది. రెండోసారి 2017లో డీఎస్సీ ప్రకటించినప్పటికీ కొన్ని అనివార్య కారణాలతో వాయిదా వేశారు. 2018లో మరో మారు డీఎస్సీ ప్రకటించి పరీక్షలు కూడా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం మారడంతో వైసీపీ ప్రభుత్వం ఆ పోస్టులను భర్తీ చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఐదేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించకపోవడం పట్ల నిరుద్యోగ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగ ఉపాధ్యాయులకు ఉద్యోగ ప్రకటన కల్పించాలని కోరుతున్నారు.



పోరుమామిళ్ల తహశీల్దారు కార్యాలయం ఎదుట ఖాళీ చాటలతో అంగన్వాడీల నిరసన



మైదుకూరులో 32 అంకె రూపంలో కూర్చున్న అంగన్వాడీలు



నిత్యావసరాలు నిండుకున్నాయి

- ఖాళీ చాటలతో అంగన్వాడీల నిరసన

కడప, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం వచ్చాక పెరిగిన ధరలు, పెరగని తమ జీతాలతో ఇంట్లో నిత్యావసర సరుకులు నిండుకున్నాయంటూ ఖాళీ చాటలతో అంగన్వాడీలు నిరసన తెలిపారు. సమ్మెలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 32వ రోజు శుక్రవారం అంగన్వాడీలు ఆందోళనలు కొనసాగించారు. పోరుమామిళ్లలో ఖాళీ చాటలతో నిరసన తెలిపారు. మైదుకూరులో 32 ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు.

కడప కలెక్టరేట్ ఎదుట ఆందోళన కొనసాగింది. కొండాపురంలో గుంజీలు తీసి నిరసన తెలిపారు. జమ్మలమడుగులో కోలాటం ఆడారు. ప్రొద్దుటూరులో తమకు బేడీలు వేయాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్దకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. బద్వేలులో మెడలకు ఉరితాళ్లతో ఆందోళన చేశారు.



ప్రొద్దుటూరులో తమకు సంకెళ్లు వేయాలంటూ పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లిన అంగన్వాడీలు

జనరల్ స్టోర్స్‌పై విజిలెన్స్ దాడులు

● రూ.50వేలు జరిమానా

కడప (క్రైం), జనవరి 12 : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు ప్రాంతంలోని జనరల్ స్టోర్స్‌లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. కడప రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంటు అధికారి షేక్ మసూంబాషా ఆదేశాల మేరకు శుక్రవారం రైల్వేకోడూరులో గల పద్మప్రియ జనరల్ స్టోర్స్, లక్ష్మీనరసింహ జనరల్ స్టోర్స్, ఎంవీఎస్ జనరల్ స్టోర్స్‌లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ప్యాకింగ్ డిక్లరేషన్స్ అంటే ఎమ్మార్పీ లేకుండా మ్యానుఫ్యాక్చరింగ్ తేదీ, ఎక్స్‌పైరీ తేదీ పాటించని, తూకాల్లో గల తేడాలు గుర్తించి ఆయా స్టోర్లపై 3 కేసులు నమోదు చేసి సుమారు రూ.50వేలు జరిమానా విధించినట్లు వారు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రెడ్డెప్ప, ఇ.బాలగంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసరు రవీంద్రరెడ్డి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టరు రెడ్డిప్రసాద్, రైల్వేకోడూరు సీఎస్ డీటీ, విజిలెన్స్ సిబ్బంది పి.సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితులు అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న సీఐ, ఎస్ఐలు

ఓబులవారిపల్లె, జనవరి 2: మండల పరిధిలో బుధవారం సాయంత్రం జరిగిన హత్యకేసులో నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. రైల్వేకోడూరు సీఐ మధుసూదన్‌రెడ్డి, ఓబులవారిపల్లె ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. జనవరి 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల సమయంలో ఓబులవారి పల్లె గ్రామ పంచాయతీ గాదెల వెళ్లే రోడ్డులో టీ బంకు వద్ద కటికంవారిపల్లె బలిజపల్లెకు చెందిన కటికం సంటప్పగారి చెంగయ్య (47) హత్యకు గురయ్యాడు. శివశంకరాపురానికి చెందిన మాదం సిద్దు మచ్చు కత్తితో నరికినట్లు మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జనవరి 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు చిన్నఓరంపాడు హైవేలో డాబా వద్ద ఉన్న నిందితుడు మాదం సిద్దును అతనికి సహకరించిన అరిగెల వెంకటయ్యను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి.. రైల్వేకోడూరు కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్టు



కడప (క్రైం), జనవరి 12: కడప నగరం ఆర్‌కేనగర్ సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్న 8 మందిని అరెస్టు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ నారాయణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ఆర్‌కే నగర్‌కు చెందిన ఎనిమిది మంది కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సీఐ రామచంద్ర ఆదేశాల మేరకు సిబ్బందితో దాడులు చేసి 8 మందిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి ఐదు కోళ్లు, రూ.6770 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మట్కా బీటరు అరెస్టు


కడప నగరం పాతబస్టాండు సమీపంలో శుక్రవారం మట్కా రాస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామి తెలిపారు. కడపకు చెందిన షేక్ మస్తాన్‌వలి పండ్ల వ్యాపారం చేస్తూ మట్కా నిర్వహిస్తుండగా అరెస్టు చేసి.. రూ.2050 నగదు, మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

లారీ ఢీ.. చిరు వ్యాపారి మృతి



ఎర్రగుంట్ల, జనవరి 12: ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలిలో అరటిపండ్ల వ్యాపారి దస్తగిరి (67) టిప్పర్ ఢీకొన్న సంఘటనలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం దస్తగిరి సైకిల్‌లో తన అరటిపండ్ల తోపుడు బండి వద్దకు వెళుతున్నాడు. నాలుగురోడ్ల వద్ద రోడ్డు క్రాస్‌చేస్తుండగా ముద్దనూరు వైపు నుంచి ప్రొద్దుటూరు వైపు వెళుతున్న టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



కడప (క్రైం), జనవరి 12: కడప నగరం సాయిపేటకు చెందిన సయ్యద్ యాకూబ్ (21) ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు వివరాల మేరకు... యాకూబ్ చదువుకుంటూ లేత్ మిషన్‌లోకి పనికి వెళ్లే వాడు. ఈనెల 11న తల్లిదండ్రులు, చెల్లెలు నంద్యాలకు వెళ్లారు. ఇంట్లో యాకూబ్ అతని సోదరుడు ఉన్నారు. ఆయన సోదరుడు మధ్యాహ్నం బయటికి వెళ్లాడు. ఈ సమ యంలో యాకూబ్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తి ఆత్మహత్య

పులివెందుల టౌన్, జనవరి 12: పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న రాణితోపు వద్ద గజ్జల వెంకటరమణారెడ్డి (69) శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. వేముల మండలం పెండ్లూరు గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డికి ఇద్దరు సంతానం.

పెద్దకొడుకు వివాహం అనంతరం పులివెందులలో నివాసం ఉంటున్నారు. కొన్ని సంవత్సరాల కిందట అతను చనిపోవడంతో వెంకటరమణారెడ్డి తన భార్యతో కలిసి పెద్దకొడుకు ఇంట్లోనే ఉండేవారని, కుటుంబానికి సంబంధించిన కొన్ని కరణాలతోనే ఉరివేసుకొని చనిపోయి ఉండవచ్చు అని అనుమానం వ్యక్తం చేశారు. వెంకటరమణారెడ్డి భార్య సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నష్టపరిహారం

● ఆర్డీవో శ్రీనివాసులు వెల్లడి

● తీవ్ర అన్యాయం జరుగుతోందని రైతుల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

ఎర్రగుంట్ల, జనవరి 12: జాతీయ రహదారి విస్తరణకు భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నష్టపరిహారం చెల్లిస్తామని జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. జాతీయ రహదారి (440)లో చాగలమర్రి నుంచి వేంపల్లె వరకు రోడ్డు విస్తరణకు రైతుల నుంచి భూసేకరణ చేసే నిమిత్తం శుక్రవారం ఎర్రగుంట్ల ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎన్‌హెచ్ ఏఈ సురేంద్ర తో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హనుమనగుత్తి, పోట్లదుర్తి, ఎర్రగుంట్ల, వై.కోడూరు, పెద్దనపాడు గ్రామాలకు చెందిన రైతులు భూములు కోల్పోతున్నారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జాతీయ రహదారి నియమ నిబంధనలు అనుసరించి ఈ భూసేకరణ చేస్తున్నట్లు తెలిపారు. ఏపీ గ్రామాల్లో ఎకరాకు ఎంత రేటు ఇచ్చేది రైతులకు వివరించారు. 2013 కేంద్ర ప్రభుత్వ నూతన భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తున్నట్లు తెలిపారు. హనుమనగుత్తి గ్రామంలోని భూములకు రూ.17,44,548, పోట్లదుర్తికి సంబంధించి రూ.23,11,879, ఎర్రగుంట్లలోని భూములకు రూ.31,67,970, కోడూరు గ్రామ భూములకు రూ.22,57,000, పెద్దనపాడు భూములకు 10,61,303 చెల్లిస్తారన్నారు. అయితే రైతులకు డబ్బు చెల్లించే సమయంలో ఈ మొత్తాలకు 12శాతం కలిపి చెల్లిస్తారన్నారు. అయితే పెద్దనపాడు గ్రామానికి గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవేరోడ్డుకు సుమారు రూ.14లక్షలు చెల్లించారని.. ఆ ప్రకారం చెల్లించేందుకు కృషి చేస్తామన్నారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలుంటే చెప్పాలని రైతులను కోరారు.

చాలా తక్కువ పరిహారం... రైతుల ఆవేదన

ప్రభుత్వం తమకు చెల్లిస్తున్న నష్టపరిహారంపై రైతులు అభ్యంతరాలు తెలిపారు. మార్కెట్‌రేట్‌తో పోలిస్తే ప్రభుత్వం చాలా తక్కువ ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కమర్షియల్ భూములకు, ఇళ్ల స్థలాలు ఉన్న, జాతీయరహదారి పక్కన ఉన్న భూములకు ఏధర చెల్లిస్తారని అడిగారు. కోర్టు కేసులున్న భూములు, ఇతర తగాదాల్లో ఉన్న భూముల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అలాగే తమ భూములు తీసుకున్న తర్వాత మిగతా పొలాలకు వెళ్లేందుకు దారి సమస్య లేకుండా చూడా లన్నారు. తీసుకున్న భూమికి హద్దును ఏర్పాటు చేస్తూ రాళ్లను పాతాలన్నారు. భూములు తీసుకున్న తర్వాత పక్కపక్కనే ఉన్న రైతులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తాము అడిగిన చోట రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాలకు వెళ్లేందుకు బ్రిడ్జిలు నిర్మించి రస్తా ఏర్పాటు చేయాలన్నారు. కాగా, సమావేశానికి ఆర్డీవో గంటకు పైగా ఆలస్యంగా వచ్చి.. త్వరగా ముగించారని, తమ సందేహాలకు సరైన సమాధానం చెప్పలేదని కొందరు రైతులు పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారం చెల్లిస్తాం... ఆర్డీఓ

హైవేకి అనుకుని ఉన్న భూములకు, స్థలాలకు, ఇళ్లకు తీసుకున్న స్థలాలకు నిబంధనల ప్రకారం వేరే ధర చెల్లిస్తారన్నారు. అలాగే మొదటి నోటిఫికేషన్‌కు ముందుగా కమిర్షియల్ చేసుకుని, ఒకటి రెండు లావాదేవీలు జరిపిన వాటికి కమిర్షియల్ ధర చెల్లిస్తారన్నారు. అలాగే స్థలాల్లో, భూముల్లో ఏవైనా కట్టడాలు, బోర్లు వుంటే వాటికి విడిగా విలువ కట్టి చెల్లిస్తారన్నారు. కోర్టులో కేసులున్న, ఇతర తగాదాల్లో ఉన్న భూములను పెండింగ్‌లో పెడతామన్నారు. రోడ్డుకు ఇరువైపులా అవసరమైనచోట రస్తా ఏర్పాటు చేస్తామని ఎన్‌హెచ్ ఏఈ సురేంద్ర తెలిపారు. రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ఏదైనా సమస్య వుంటే తనకు చెప్పవచ్చునని తహసీల్దార్ ఏ.నాగేశ్వరనావు తెలిపారు.

రైతుల సమస్యలను ఫ్రెండ్లీగా పరిష్కరించాలి : ఎస్ఈ



మాట్లాడుతున్న జిల్లా విద్యుత్తుశాఖ అధికారి రమణ

చాపాడు/మైదుకూరు, జనవరి 12: మండలంలోని రైతులు, ప్రజల సమస్యలను విద్యుత్తు సిబ్బంది ఫ్రెండ్లీగా పరిష్కరించాలని విద్యుత్తుశాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ పేర్కొన్నారు. మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో ఉన్న 33/11 విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను, చాపాడు గ్రామంలో దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్తు లైన్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్తు సిబ్బంది పనితీరు ఇంకా బాగా మెరుగుపరచుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యుత్తు వినియోగదారులు ఇబ్బందులకు గురవుతారన్నారు. లైన్‌మెన్లు గ్రామాలకు వెళ్లి దెబ్బతిన్న కరెంటు లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును నిరంతరంగా సరఫరా చేయాలని సూచనలు ఇచ్చారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తానని సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట మైదుకూరు డీఈఈ శ్రీనివాసులరెడ్డి, మండల ఏఈ సాయి ఉన్నారు.

వేసవిలో విద్యుత్ కోతలు లేకుండాచూడాలి

వేసవి కాలన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే వినియోగదారులకు విద్యుత్ కోతలు లేకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖాధికారి యస్.రమణ పేర్కొన్నారు. మైదుకూరు విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం సిబ్బంది, కొందరు వినియోగదారులతో ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ సరఫరాలో కోతలు లేకుండా చూసుకోవాలని, అందుకు సంబంధించిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలని, రైతులకు అవసరమైన విద్యుత్ ఇవ్వాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్





సమావేశంలో ప్రసంగిస్తున్న పసుపులేటి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ పవన్‌కుమార్, హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణులతో పవన్‌కుమార్

● రాజంపేట నియోజకవర్గ టీడీపీ నేత, పసుపులేటి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ పవన్‌కుమార్

రాజంపేట టౌన్, జనవరి 12: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని టీడీపీ నియోజకవర్గ నేత, పసుపు లేటి ఫౌండేషన్‌ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో తమ తండ్రి మాజీ మంత్రి స్వర్గీయ పసుపులేటి బ్రహ్మయ్య స్మారకార్థం నిర్వహించిన 45వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 12 జిల్లాలకు చెందిన 19 జట్ల క్రీడాకారిణులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలు పోటములు సమానమని, ఓటమిని ఒక అనుభవంగా తీసుకొని ముందు కు సాగితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పసుపులేటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన క్రీడా కారిణులకు ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు బీహార్ జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం క్రీడాకారులందరికీ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాన్వి ఇంటర్నేషనల్ డైరెక్టర్ భరత్‌కుమార్‌రాజు, ఏపీ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజనేయులు, కార్యదర్శి రవి, చంద్రశేఖర్‌రావు, సత్యప్రసాద్, సురేష్‌కుమార్, నిర్మల, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

● కళాశాల చైర్మన్ బి.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 12: కడప నగరం ఉక్కాయపల్లె గ్రామ పంచాయతీలో గల శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల (ఎస్ఐటీఎస్)కు నాక్ ఉత్తమ ఏ గ్రేడ్ (3.14 జీపీఏ) లభించినందుకు కళాశాల చైర్మన్ బి.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ డాక్టర్ వై.నాగరాజు సంతోషం వ్యక్తం చేశారు. ఈ నెల 4, 5 తేదీల్లో జరిగిన నాక్ ఇన్‌స్పెక్షన్‌లో కళాశాలలో గల విద్య, వసతులు మంచి అధ్యాపకులు, వివిధ విభాగాల్లో చేసిన అభివృద్ధిని గుర్తించడంతో తమ కళాశాలకు ఏ గ్రేడ్ లభించిందని తెలిపారు. ప్రిన్సిపల్ నాగరాజు ఆధ్వర్యంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం చక్కటి సమన్వయంతో కృషి చేసినందుకు ప్రతి ఫలంగా కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ లభించిందని చైర్మన్ శ్రీనివాసులు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో ఈ సంక్రాంతి వ్యక్తిగతంగా తనకు, కళాశాలకు రెట్టింపు ఆనందం ఇచ్చిందని తెలిపారు. కాగా, కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు చైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా బహుమతులను అందించారు.

ఫ్లాష్... ఫ్లాష్

లారీ ఢీకొని అన్నదమ్ములు మృతి

మైదుకూరు, జనవరి 12: హోటల్లో భోజనం చేసి వస్తున్న అన్నదమ్ములను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మైదుకూరు నుంచి కర్నూలు బైపాసు రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా... పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఇమామ్ (25), షరీఫ్ (24) ఇరువురూ కలిసి డాబా వద్ద భోజనం చేసి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. ఇంతలోనే కర్నూలు వైపు నుంచి కడప వైపు వస్తున్న లారీ ఢీకొన్నట్లు తెలుస్తోంది. దీంతో ఇమామ్, షరీఫ్‌లు ఇరువురూ అక్కడికక్కడే మృతిచెందారు. కాగా ఇమామ్‌కు భార్య, పిల్లలు ఉన్నారని స్థానికుల సమాచారం. సంఘటనా స్థలానికి మైదుకూరు పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి వ మృత దే హాలన ు పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దు టూరు ఆసుపత్రికి తరలించారు.





మృతిచెందిన ఇమామ్, షరీఫ్‌లు

ఆన్‌లైన్ ద్వారా ఎంప్లాయిమెంట్ నమోదు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 12: జిల్లాలోని నిరుద్యోగ యువత ఎక్కడినుంచైనా ఆన్‌లైన్ ద్వారా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలో నమోదు చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ పీఎస్ గిరీషా తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లు/ మోడల్ కెరీర్ సెంటర్ల ద్వారా అందించే సేవలను భారత ప్రభుత్వ నేషనల్ కెరీర్ సర్వీసు (ఎన్‌సీఎస్) పోర్టల్‌తో ఆన్‌లైన్‌లో అనుసంధానించిందన్నారు. ఈఆన్‌లైన్ సేవలు (ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యూవల్, అదనపు అర్హతల నమోదు) సులభరీతిన ఎంప్లాయిమెంట్.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ సేవలు, అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లు/ మోడల్ కెరీర్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, మొబైల్స్ ద్వారా కూడా పొందవచ్చునన్నారు. సంబంధిత జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం అధికారి అభ్యర్థులను ఆమోదించిన పిదప ఎస్ఎంఎస్ ద్వారా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు తెలియజేస్తారన్నారు.

ఏపీ ఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ

ఏపీ ఎన్జీవో రాయచోటి యూనిట్ టేబుల్ క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ పీఎస్ గిరీషా ఆవిష్కరించారు. ఏపీ ఎన్జీవో అసోషియేషన్ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, జిల్లా కార్యదర్శి రవికుమార్, రాయచోటి అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కలెక్టర్ ఆవిష్కరించారు. అదే విధంగా జిల్లా సచివాలయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను కూడా ఆవిష్కరణ చేశారు. సచివాలయ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌అలీ, తాలూకా నాయకులు మహమ్మద్‌బాషా, మహదేవ, శ్రీనివాసులు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ విషయంలో దళారులను నమ్మవద్దు

● డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్), జనవరి 12: జిల్లాలో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ పారదర్శకంగా జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో వివిధ కేటగిరీలకు సంబంధించి టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్ (మేల్ అండ్ ఫీమేల్) కాంట్రాక్టు పద్ధతిలో 2014కు ముందు నుంచి పని చేస్తున్నారని.. వారిని శాశ్వత ప్రాతిపదికన క్రమబద్ధీకరించే ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని డీఎంఅండ్ హెచ్ఓ ఆప్రకటనలో తెలిపారు.

బకాయిలు చెల్లించే వరకు పోరాటం ఆగదు

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 12: ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన అన్నిరకాల బకాయిలను చెల్లించే వరకు తమ పోరాటం ఆగదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ఆఫీస్ బేరర్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ప్రభుత్వం కక్షపూరిత చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఉద్యోగులు తమ అవసరాల కోసం దాచుకున్న సొమ్మును సైతం రాష్ట్ర ప్రభుత్వం తమ అవసరాలకు మళ్లించి వారికి చెల్లించకపోవడం తగదన్నారు. ఉద్యోగులు కూడబెట్టుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్మును ఉద్యోగులకు తెలియకుండానే వాడుకున్న చరిత్ర ఈ ప్రభుత్వానికి దక్కిందన్నారు. తక్షణం తమకు రావాలసిన ఆర్థిక బకాయిలన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగానే జనవరి 14న భోగిమంటల్లో ప్రభుత్వ విధానాలు, నిర్లక్ష్యాన్ని దహించే విధంగా వినూత్న కార్యక్రమాలను చేపడతామన్నారు. జనవరి 19న నగర, తాలుకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, 24న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శన, 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జిల్లా కేంద్రాల్లో రిలేనిరాహారదీక్షలు నిర్వహిస్తామని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ తీర్మానించిందన్నారు. వీటిని జయప్రదం చేసేందుకు అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వై.రవికుమార్, నరసింహారావు, చెన్నయ్య, శ్రీనివాసరావు, రమణ, పర్వీన్, ఎ.శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ కన్వీనరు ప్రభాకర్ పాల్గొన్నారు.

హక్కులకు రక్షణ కవచంలా రాజ్యాంగం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి



భారత న్యాయవాదుల సంఘం డైరీ, క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రధాన జడ్జి

కడప(రూరల్) జనవరి 12 : దేశంలోని సర్వజనుల హక్కులకు భారత రాజ్యాంగం రక్షణ కవచంలా ఉందని... దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత న్యాయవాదులందరిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి పేర్కొన్నారు. భారత న్యాయవాదుల సంఘం 2024 డైరీ, క్యాలండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ భారత రాజ్యాంగం పవిత్ర గ్రంథంలాంటిదన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల హక్కులను కాపాడుతోందన్నారు. కార్యక్రమంలో భారత న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు సి.సుబ్రమణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా, ఐఏఎల్ న్యాయవాదులు టీవీ రమణ, అమీన్‌పీరా, అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు



అవార్డు అందుకున్న వారితో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప (క్రైం), జనవరి 12 : పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నలుగురు సిబ్బందిని ఎంపిక చేసి నగదు రివార్డు, ప్రశంసాపత్రం అందించి అభినందించారు. కడప టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచడంతో పాటు క్రికెట్ బెట్టింగ్ కేసులో రూ.10,15,000ల నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర వహించిన ఏఎస్ఐ పి.భాస్కర్‌ను ఎస్పీ అభినందించారు. అలాగే బద్వేలు పోలీసుస్టేషన్ పరిధిలో ఓ కేసులో ఐదేళ్లుగా పరారీలో ఉన్న వ్యక్తిని లుక్ అవుట్ సర్క్యులర్ ద్వారా హైదరాబాదు ఎయిర్‌పోర్టుకు వెళ్లి అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. ఆ బృందంలో బద్వేలు పీఎస్ కానిస్టేబుళ్లు బి.రాజమోహన్ (పీసీ 2546), ఎన్.రమేష్ (పీసీ 2730)లు ఉండగా.. వీరిని ఎస్పీ అభినందించారు. ఇక స్పందన విభాగం కానిస్టేబుల్ షేక్ మున్నాఖాదర్‌వల్లి (పీసీ 1537) జిల్లాకు చెందిన జేకేసీ ఫిర్యాదులు, స్పందన ఫిర్యాదులను సకాలంలో ఆయా పోలీసు అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించడంలో కీలక పాత్ర వహించడంతో అభినందించారు.

టీడీపీకి పెరుగుతున్న ఆదరణ

● రాబోయే రోజుల్లో పెద్ద నాయకులు చేరే అవకాశాలు ● అందరం కలిసికట్టుగా పనిచేస్తే భారీ మెజార్టీ ● కార్యకర్తలకు పుత్తా నరసింహారెడ్డి పిలుపు



కమలాపురం నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి... హాజరైన టీడీపీ శ్రేణులు

కమలాపురం (కడప ఎన్టీఆర్ సర్కిల్), జనవరి 12 : 'తెలుగుదేశం పార్టీకి ఆదరణ పెరుగుతోంది. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు మన కోసం ఎదురుచూస్తున్నారు. తమ కష్టాలను చెప్పుకుంటున్నారు' అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. కమలాపురంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరపునాయునిపల్లె, పెండ్లిమర్రి మండలాల్లో భారీగా వైసీపీని వీడి ప్రజలు టీడీపీలో చేరుతున్నారన్నారు. ప్రధానంగా వీరపునాయునిపల్లె మండలంలో ఎక్కువ మంది టీడీపీ పట్ల ఆకర్షితులవుతున్నారన్నారు. గతంలో ఈ మండలం పులివెందులకు సమీపంలో ఉండటం వల్ల వైఎస్ కుటుంబంపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఉండేవారన్నారు. అయితే వారు ఏ విధమైన సహాయం చేయలేదన్నారు. దీంతో ప్రజల్లో మార్పు వస్తుందన్నారు.వీరపునాయునిపల్లె మండలంలో సర్వరాయసాగర్ నిర్మించారని, దీంతో ఈ మండలంలోని 25వేల పైచిలుకు ఎకరాలకు సాగునీరు అందుతుందనుకుంటే కేవలం 20వేల ఎకరాలకు కూడా అందని పరిస్థితి అన్నారు.

ఎమ్మెల్యేపై ముస్లింల వ్యతిరేకత

కమలాపురం శాసనసభ్యుడు పి.రవీంద్రనాథరెడ్డిపై ముస్లింల వ్యతిరేకత ఎక్కువగా ఉందని పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు.వల్లూరు మండలంలోని గోటూరు వద్ద వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి ఎంపీ అవినాష్‌రెడ్డి మామకు విక్రయించారని, అయితే ఆ స్థలం రిజిస్ట్రేషన్ కాకపోవడంతో తిరిగి డబ్బు చెల్లించేందుకు పంచాయతీ జరుగుతోందన్నారు. తయ్యబ్ ముస్లిం కళాశాలకు చెందిన భూమిలో బంధువుల మధ్య విబేధాలు రావడంతో ఆ భూమిని ఎకరా రూ.90లక్షలతో కొనుగోలు చేసి ఆయన భార్య అరుణమ్మ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. దానిపై భూయజమానులు కోర్టుకు వెళ్లారన్నారు. రూ.90లక్షలతో కొనుగోలు చేసిన భూమిని రూ.కోటీ 90 లక్షలకు వేరే వారికి అమ్మారన్నారు. టీడీపీ హయాంలోనే ప్రజలకు జనరంజకమైన సంక్షేమ పథకాలు అమలయ్యేయన్నారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ, సహజ మరణాలకు కూడా బీమా ఇవ్వడం, పెళ్లిళ్లకు కానుకలు లాంటి అనేక పథకాలు అమలయ్యేవన్నారు. జగన్ వచ్చిన తరువాత సంక్రాంతి కానుక, రంజాన్‌తోఫా, క్రిస్టమస్ కానుకలకు మంగళం పలికారన్నారు. గతంలో స్టోరులో అన్ని రకాల వస్తువులు ఇచ్చేవారన్నారు. అమ్మఒడి అందరికీ అని చెప్పి అనేక కోతలు విధించారన్నారు. అమలు కాని ఆరోగ్యశ్రీకి 25 లక్షలకు పెంచడం దేనికని ఆయన ప్రశ్నించారు. మరి కొన్ని రోజుల్లో ఎన్నికలు రాబోతున్నాయని, జనసేన, టీడీపీ కలిసి మరో మేనిఫెస్టోను ఇవ్వనున్నారని పేర్కొన్నారు.

యువతకు స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద

● జయంతి వేడుక కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నేతలు



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శశిభూషణ్‌రెడ్డి

కడప (మారుతీనగర్), జనవరి 12: యువతకు స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బత్తల పవన్ కుమార్, జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్ కొనియాడారు. స్వామి వివేకానంద జయంతి (జాతీయ యువజన దినోత్సవం) సందర్భంగా భారతీయ జనతాయువ మోర్చా (బీజేవైఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీప నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. యువకులు సమాజంలో మన కళ్లముందు జరిగే చెడును వ్యతిరేకించేందుకు కెరటంలా దూకుడుగా మెలగాలన్నారు. ముఖ్యంగా మనదేశ గొప్పతనాన్ని, సంస్కృతీ సాంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకుని సమాజ వికాసానికి గమ్యం చేరే వరకూ విశ్రమించరాదని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వి.వి. చలపతి, యాపమాని హరినారాయణరావు, లక్ష్మీనారాయణరెడ్డి, బద్వేలు మాజీ ఎమ్మెల్యే జయరాములు, బీజేవైఎం నాయకులు హరికృష్ణ, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరులో... ఆధ్యాత్మికతే భారత్‌కు మూలం, అని ప్రతి ఒక్కరూ ఆ దిశగా అడుగులు వేయాలని బీజేపీ చెన్నూరు మండల కన్వీనరు భాస్కర్ అన్నారు. స్వామివివేకానంద 162వ జయంతి సందర్భంగా చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు మాట్లాడుతూ సముద్ర కెరటాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జాతికి సరైన దశ నిర్దేశం చేయగలిగితే వివేకానంద ఆలోచనలేనన్నారు. ఆయన బోధించిన వ్యక్తి నిర్మాణం, సాంస్కృతిక జాతీయ వాదంలాంటివి మనం నిత్యం గుర్తుంచుకుని సమస్యల పరిష్కారం కోసం ఆధ్యాత్మిక చైతన్యంతో ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబరు అతికారి రవికుమార్, జిల్లా యువజన విభాగం కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ సతీష్, డాక్టర్ సాగర్‌కుమార్ పాల్గొన్నారు.

వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



మాట్లాడుతున్న అమృతానంద స్వామీజీ

చక్రాయపేటలో... దేశంలోని యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని గండి క్షేత్రం సమీపంలో వెలసిన ప్రేమానంద ఆశ్రమ స్వామి అమృతానంద, బీజేపీ నాయకులు రామచంద్రరెడ్డి, లాయర్ రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నాగులగుట్టపల్లె గ్రంథాలయం ఎదుట ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆయన చిత్రపటానికి పూజలు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత హిందూ యువత హృదయ సామ్రాట్ స్వామి వివేకానంద అని, ఆయన చేసిన సేవలు, దేశభక్తిని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా తిరిగి విప్లవశంఖారావం పూరించి హిందూ మతం గురించి గొప్పగా చెప్పారన్నారు. యువత మేల్కొన్న నాడే దేశం అన్ని విధాలా పురోగతి చెందుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు, ప్రజలకు స్వీట్లు పంచి వివేకానందుని జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీచారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె చైతన్య స్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, వేంకటేశ్వరదేవస్థాన మాజీచైర్మన్ ఓబుళరెడ్డి, లక్ష్మిరెడ్డి, ప్రసాదరెడ్డి, సునిల్, గంగాధర్‌రెడ్డి, దశరథ, స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు బాగుపడాలంటే చంద్రబాబే సీఎం కావాలి



చెన్నూరు: భవిష్యత్తుకు బాబు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

చెన్నూరు, జనవరి 12: రాష్ట్ర భవిష్యత్తు బాగుపడాలంటే చంద్రబాబే సీఎం కావాలని టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. చెన్నూరుతో పాటు కొండపేట, ముండ్లపల్లె గ్రామాల్లో శుక్రవారం భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనరు మాట్లాడుతూ ఇంతకాలం ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డా సరైన నేత రాక కోసం ఎదురు చూడడం చాలా గొప్ప విషయమని వారందరికీ టీడీపీ అభినందనలు తెలుపుతుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీనిగెలిపించుకోవాలన్నారు. కమలాపురం నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి నిత్యం శ్రమించే సరైన నేత పుత్తా నరసింహారెడ్డి అని ఆయన గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు సూపర్‌సిక్స్‌పథకాలు అన్ని వర్గాలను అభివృద్ధిపరంగా ముందుకు వెళ్లేందుకు ఉపయోగపడతాయన్నారు. తద్వారా మంచి లబ్ధి చేకూరి చిన్న మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కుతాయన్నారు. చంద్రబాబులాంటి దూరదృష్టి గల నేత గతంలో ఉన్నప్పుడే రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు, మంచి పరిశ్రమలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఐ.శివారెడ్డి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డి, కొండపేట నేతలు మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ముండ్లపల్లె నేతలు రాజగోపాల్‌రెడ్డి, మణికంఠతో పాటు మంజూర్ అహ్మద్, జిలానీ, కరీం, సాదక్, సంజీవ్‌పవన్, మాబు, శ్రీరామిరెడ్డి, ఖాసింపీరా పాల్గొన్నారు.

పండుగలు మన సాంప్రదాయానికి ప్రతీకలు



కేఎస్ఆర్ఎం కళాశాలలో బోగిమంటలు వేసి ముందస్తు సంబరాలు చేసుకుంటున్న కందుల రాజేశ్వరమ్మ తదితరులు

సీకేదిన్నె, జనవరి 12: పండుగలు మన సాంప్రదాయాలకు ప్రతీకలని, వాటిని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కందుల విద్యాసంస్థల కరస్పాండెంట్, కోశాధికారి కందుల రాజేశ్వరమ్మ తెలిపారు. కేఎస్ఆర్ఎం కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన సాంప్రదాయాలు భావితరం విద్యార్థినీ విద్యార్థులకు తెలియజేసేలా పండుగలను జరుపుకోవాలని ఇంటిల్లిపాది సం తోషంగా జరుపుకోవడం ద్వారా అందరికి ఆనం దం కలుగుతుందన్నారు.

ఈ సందర్భంగా పాలు పొంగించి చక్రపొంగలి, బోగిమంటలు, ముగ్గుల పోటీలు, గాలిపటాలు ఎగురవేయడం, వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ హేమలత, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మశీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 12 : కడప నగరం శివారు ప్రాంతంలో గల నిర్మల ఫార్మశీ కళాశాలలో ఒమెగా హెల్త్ కేర్ చెన్నై ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బి.శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు భవిష్యత్తు కార్యాచరణపై దిశ నిర్దేశం చేశారు. ఒమెగా హెల్త్ కేర్ చెన్నై హెచ్ఆర్, టీం సభ్యులకు విద్యార్థులకు రాత పరీక్షలు నిర్వహించి మెరుగైన విద్యార్థులను ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేశారు. విద్యార్థులకు ఎంపిక పత్రాలు ఇచ్చి వారి సరస్థలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్‌కుమార్ ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చిన లోపాలను గుర్తించాలి

వల్లూరు, జనవరి 12 :పుట్టుకతో వచ్చిన లోపాలను గుర్తించాలని జిల్లావైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోట్లూరు గ్రామంలో రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, వైద్యసౌకర్యాల ఉపయోగాల కోసమే దూర ప్రాంతాలకు వెళ్లకుండా తమ సచివాలయాల పరిధిలోనే ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అలాగే కంటి పరీక్షలను కూడా నిర్వహిస్తున్నారని అన్నారు. అనంతరం గ్రామంలో కలియదిరిగారు.

'జీఓను రద్దు చేయాలి'

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 12 : వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటలింగ్‌యాక్టు జీవో 27/2022ను రద్దు చేయాలని టీడీపీ జిల్లా లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎస్ మూర్తి, జిల్లా అధ్యక్షుడు గంగిరెడ్డి శివ శంకర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. శుక్రవారం ద్వారకనగర్ టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యుడు శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ఇచ్చిన జీవోను భూకబ్జాల వైసీపీ నేతలు, నాయకులకు మేలు చేకూర్చుతుందన్నారు. రిజిస్టరులో భూహక్కుదారుడు పేరు ఒక్కసారి నమోదైతే అ భ్యంతరంపై కోర్టుకు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. సన్నకారురైతులు, సామాన్య ప్రజలకు అన్యాయం జరుగుతోందన్నారు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

● డీఎంహెచ్ఓ నాగరాజు



కనుపర్తిలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

చెన్నూరు, జనవరి 12 : ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని డీఎంహెచ్ఓ నాగరాజు అన్నారు. మండలంలోని కనుపర్తిలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య పరీక్షలను ఆయన పరిశీలించారు. రక్తపరీక్షలు ఎలా చేస్తున్నారు. మందులు తగినన్ని అందుబాటులో ఉన్నాయా, సీజనల్ వ్యాధులకు ఎలా వైద్యం చేస్తున్నారు లాంటి విషయాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యపరంగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, దోమల వల్ల పెరిగే వ్యాధులు తదితర అంశాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు ఇబ్బందులు పెడుతుంటాయని, చెన్నూరులోనే ఒక వైపు పీహెచ్‌సీ, మరో చోట సీహెచ్‌సీ ఉందని రెండు చోట్ల డాక్టర్లు అందుబాటులో ఉంటారు కాబట్టి చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా వైద్యం చేయించుకోవాలన్నారు. అన్నిరకాల వైద్యులు అందుబాటులో ఉన్నారని వారు తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. దాదాపు 312 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్‌లు చెన్నారెడ్డి, వంశీక్రిష్ణతో పాటు ఎంపీటీసీ రఘురామిరెడ్డితో పాటు గ్రామ పెద్దలు పల్లె క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

అన్నమాచార్య కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



అన్నమాచార్య కళాశాలలో రంగవల్లులతో అలరించిన విద్యార్థినులు

సీకేదిన్నె, జనవరి 12: అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి ముందస్తు సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ముందస్తు సంబరాల్లో భాగంగా శుక్రవారం కళాశాలలోని విద్యార్థులకు వివిధ రకాల ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, ఉట్టికొట్టే కార్యక్రమం తదితర అంశాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం బోగిమంటలు, గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి అందరు ముందుగానే పండుగ వాతావరణాన్ని ప్రతిభింభింపజేశారు.

సంక్రాంతి పండుగ మన తెలుగువారికి పెద్దపండుగ అని, దీన్ని సాంప్రదాయబద్ధంగా జరుపుకుని మన సాంప్రదాయాలను పిల్లలకు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీల గోడు పట్టని ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం



అంగన్వాడీల దీక్షలకు మద్దతు తెలుపుతున్న వెంకటసుబ్బయ్య, డీవైఎఫ్ఐ నాయకులు

కడప (నాగరాజుపేట), జనవరి 12 : అంగన్వాడీల గోడు పట్టని ప్రభుత్వానికి తగిన బుద్ధిచెబుతామని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన 32వ రోజు సమ్మెలో భాగంగా శుక్రవారం రిలే దీక్షలు 7వరోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవిలు మాట్లాడారు. కడప కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌లు 2023 డిసెంబరు 12వతేదీ నుండి సమ్మె చేస్తున్నా వైసీపీ ప్రభుత్వానికి జవాబుదారీతనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. అంగన్వాడీల సమ్మె డిమాండ్లు వారి యూనియన్‌లతో పిలిచి చర్చించి పరిష్కరించకఉండా సమ్మె అణచివేయడానికి ఎస్మా చట్టాన్ని ప్రయోగించడానికి జీవో నెం.2ను ప్రభుత్వం పాస్ చేయడం దారుణమన్నారు. ఈ చట్టం సర్వీసు రిజిస్టరులో ప్రభుత్వ ఉద్యోగం నమోదైన వారిపై మాత్రమే ప్రయోగిస్తారన్నారు. వైసీపీకి గడ్డు రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. జగన్ ప్రభుత్వానికి జవాబుదారీతనం లేకుండాపోయిందన్నారు. రాష్ట్ర ప్రభు త్వం విడుదల చేసిన జీఓ నెం.2 ఎస్మా చట్ట ప్ర యోగం జగన్ ప్రభుత్వం కూలిపోవడానికి నాంది అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీవో నెం.2ను రద్దు చేయాలని లేదంటే రాబోవు రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమానికి డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంగన్వాడీ నాయకురాళ్లు ఎంపీ అంజనీదేవి, వసుంధర, మెర్సీ ప్రసన్న, అబిద్, పద్మ కూర్చున్నారు. సీఐటీయు జిల్లా నగర అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లకు నోటీసులు

బ్రహ్మంగారిమఠం, జనవరి 12: అంగన్వాడీ టీచర్లు, ఆయాలు విధుల్లోకి చేరాలని ప్రభుత్వం జారీ చేసిన నోటీసులను సచివాలయ సిబ్బంది ఇళ్లకు అంటిస్తున్నారు. ఈ నోటీసులు మా ఇళ్లకు ఎందుకు అంటిస్తున్నారని మీరేమైనా ఉంటే అంగన్వాడీ స్కూళ్లకు అంటించాలని అనడంతో ఇళ్లకు అంటించాలని ఉన్నతాధికారులు చెప్పారని సమాధానం ఇచ్చారు. ముందుగా అంగన్వాడీ యూనియన్ లీడర్ల ఇంటికి వెళ్లి నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో విధులకు హాజరు కాకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో ఉన్నట్లు తెలిపారు.

నోటీసులా..? భయపడం

32 ఆకారంలో అంగన్వాడీల నిరసన ● మోకాళ్లపై నిలబడి, లెంపలేసుకుంటూ, ఖాళీ చాటలో సరుకుల పేర్లతో నిరసన

● బేడీలు వేయమని పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన

జమ్మలమడుగు, జనవరి 12: ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల సిబ్బంది అంగన్వాడీ సెంటర్లకు వచ్చి నోటీసులు అతికించి వెళుతున్నారు. నోటీసులకు భయపడే ప్రసక్తేలేదని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తేల్చిచెప్పారు. శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీలు 32వరోజు నిరసనలో భాగంగా 32 ఆకారంలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, యూనియన్ నేతలు కోలాటం ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారమయ్యేదాకా తాము ఎలాంటి బెదిరింపులకు భయపడమన్నారు. ఐసీడీఎస్ అధికారులు అంగన్వాడీ కార్యకర్తలను ఒకరికి తెలియకుండా ఒకరికి ఫోన్లు చేసి విధులకు వెళ్లాలని సచివాలయ ఉద్యోగులు అంగన్వాడీ సెంటర్ వద్ద నోటీసులు ఇస్తున్నారని బెదిరిస్తున్నట్లు కొందరు తెలిపారు. ఇలాంటి బెదిరింపులు మానుకుని అంగన్వాడీలకు అధికారులు మద్దతు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. యూనియన్ నేతలు ప్రసాద్, ఓబులేసు, విజయ్, బాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, నరసమ్మ, సుబ్బలక్షుమ్మ, కుళాయమ్మ, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన

కొండాపురం, జనవరి 12: అంగన్వాడీ కార్యకర్తలు కొండాపురంలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. జీతాలు పెంచి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు తారాదేవి, పద్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

32 ఆకారంలో నిరసన...

మైదుకూరు, జనవరి 12: తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందంటూ అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె శుక్రవారానికి 32వ రోజుకు చేరుకుంది. దీంతో వర్కర్లు, కార్యకర్తలు 32 ఆకారంలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె దీక్షలకు టీడీపీ, జనసేన, ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు మద్దతు పలికారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. దీక్షలో వరలక్ష్మి, నాగవేణి, వీరమ్మ, మరియమ్మ, సుబ్బలక్ష్మి, కూర్చున్నారు. భారతీ, చెన్నమ్మ, లక్ష్మీదేవి, గంగావతి, రామతులసి, రిజ్వానా, అనురాధ, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

చాపాడులో....

చాపాడు, జనవరి 12: తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఎం జగన్ వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యేవరకు ధర్నా కొనసాగిస్తామన్నారు.

ఎర్రగుంట్లలో....

ఎర్రగుంట్ల, జనవరి 12: ఉదయం నుంచి అంగన్వాడీలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నెల దాటినా ప్రభుత్వం తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని విమర్శించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ఖాళీ చాటలో నిత్యావసర సరుకుల పేర్లతో....

పోరుమామిళ్ల, జనవరి 12: సీఐటీయూ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెలో ఖాళీ చాటలతో నిత్యావసర సరుకులు నిండుకున్నాయని నిరసన తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే సీఎం జగన్ నిరంకుశ వైఖరితో వ్యవహరిస్తున్నారన్నారు. అంగన్వాడీ నాయకురాలు వినోదా దేవి, రేణుక, స్వాతి, జ్యోతమ్మ, విజయమ్మ, అంజనమ్మ, ఫాతిమా, శ్రీదేవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

లెంపలేసుకుని నిరసన...

బద్వేలు రూరల్, జనవరి 12: ఓట్లేసి అధికారంలోకి తెచ్చి తప్పు చేశాం జగనన్నా అంటూ అంగన్వాడీలు లెంప లేసుకుని నిరసన చేపట్టారు. సీఐటీయూ కార్యదర్శి శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ఖదీరయ్య, అంగ న్వాడీ నేతలు సుభాషిని, హుసేనమ్మ, సత్యవతి, కళావతి, రాధమ్మ, అరుణమ్మ పాల్గొన్నారు.

బేడీలు వేయమని పోలీసుస్టేషన్ వద్ద...

ప్రొద్దుటూరు ,జనవరి 12: మాకు బేడీలు వేయమని త్రీ టౌన్ పోలీసుస్టేష వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం నుంచి త్రీటౌన్ వరకు ర్యాలీగా వెళ్లి బేడీలు వేయమని అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, వర్కర్స్ యూనియన్ నేతలు సుబ్బలక్ష్మీ రాణి గురుదేవి, శివమ్మ, కృష్ణ వేణి, విజయ పద్మ పాల్గొన్నారు.







బద్వేలులో మెడకు తాళ్లు కట్టుకుని - జమ్మలమడుగులో కోలాటం ఆడుతూ.... - కొండాపురంలో గుంజీలు తీస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు

ఘనంగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 12: విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలు పాటించి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామసుబ్బమ్మ తెలిపారు. శుక్రవారం కళాశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు మెహందీ, రంగోళి, గాలిపటాల పోటీలు, ఉట్టికొట్టడం, భోగిమంటలు వేశారు. దేశీయ రుచులతో ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు కట్టిపడేశాయి. కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కోడైరెక్టర్ శైలూషా, డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్ రావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు



వేడుకల్లో డిగ్రీ విద్యార్థులు

మైదుకూరు, జనవరి 12: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు అలరించాయి. ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ వేషధారణతో వేడుకల్లో పాల్గొన్నారు. భోగి మంటలు, ముగ్గులు, గంగిరెద్దులతో ముందస్తు వేడుకను నిర్వహించారు.

నేడు సీబీఐటీలో సంక్రాంతి సంబరాలు

చాపాడు, జనవరి 12: సీబీఐటీ కాలేజీలో 13న శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు కాలేజీ చైర్మన్ జయచంద్రారెడ్డి తెలిపారు. ముగ్గుల పోటీలు, గాలిపటాలు ఎగురవేయడం, పలు రకాల స్టాల్స్ నిర్వహించడం, కోలాటం, బొంగరాలు తిప్పడం, గోలీలాట, భోగిమంటలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అరగంటకే ముగిసిన సమావేశం

మైలవరం, జనవరి 12: వెలుగు కార్యాలయ సభా భవనంలో శుక్రవారం జరిగిన మైలవరం మండల సమావేశం నామమాత్రంగా సాగింది. ఉదయం 11:30 గంటలకు ప్రారంభమైన సమావేశం 12 గంటలకే ముగిసింది. ఎంపీపీ సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముద్రపంది సర్పంచ్ పెద్దక్క మాత్రమే హాజరుకాగా సమావేశం మధ్యలో మరో ఇద్దరు సర్పంచులు హాజరయ్యారు. సమావేశం చివర్లో ఒక సర్పంచ్ హాజరయ్యారు. ఎంపీటీసీలు 12 మంది ఉండగా ఎంపీపీతో కలిపి ఐదుగురే హాజరయ్యారు. జడ్పీటీసీ, తహసీల్దారు సహా పలువురు మండల అధికారులు సైతం పూర్తి స్థాయిలో హాజరుకాక పోవడంతో మండల అధికారులు సైతం ఆయా శాఖల గురించి పూర్తి వివరాలు చెప్పలేకపోయారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామచంద్రారెడ్డి, సర్పంచులు గురివిరెడ్డి, పుల్లారెడ్డి, రామాంజి, ఎంపీటీసీలు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అహంకార ధోరణికి నిదర్శనం

● పోలీసు అధికారుల సంఘం ఎందుకు స్పందించదు

● ఎస్ఐపైనే దౌర్జన్యం చేస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటి

● రాచమల్లు వ్యాఖ్యలపై స్పందించిన మాజీ ఎమ్మెల్యేలు వరద, లింగారెడ్డి

ప్రొద్దుటూరు , జనవరి 12: మూడు మద్యం సీసాలకు మించితే పట్టుకోవచ్చని అధికారం ఇచ్చి ప్రజాప్రతినిధులు వద్దని దౌర్జన్యం చేస్తే ఎలాగని, ఎస్సైపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి అహంకార ధోరణికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, కడప పార్లమెంట్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు లింగారెడ్డి విమర్శించారు. గురువారం ఎస్ఈబీ స్టేషనుకెళ్లి దౌర్జన్యంగా నిందితుడిని బయటకు తీసుకెళుతూ ఎస్సైపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్పందించిన వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. వరదరాజులరెడ్డి మాట్లాడుతూ మూడు మద్యం సీసాల కంటే అదనంగా తీసుకెళితే పట్టుకోమని అధికారమిచ్చి ఎస్ఈబీ అధికారులను ఎమ్మెల్యే పట్టుకోవద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీలో వుండి అసెంబ్లీలో మాట్లాడి ముఖ్యమంత్రికి చెప్పి చట్టంలో సవరణ చేయించమని సలహా ఇచ్చారు. ప్రైవేటు బార్ల ఆదాయనికి దెబ్బపడుతుందని వాటికి దగ్గరలో వున్న ప్రభుత్వ మద్యం దుకాణాలను తరలించిన సందర్భంలో రాచమల్లు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. ప్రభుత్వంలో వుండి చట్టాన్ని తూట్లు పొడిచేలా మాట్లాడేది రాచమల్లుకే చెల్లన్నారు. కంబట్లో అన్నంతింటూ అన్నంలో ఎంటికలున్నాయనే రకం రాచమల్లుదని ఎద్దేవా చేశారు. నీతిమంతుడైతే మాట్లాడాలి గానీ తానే అవినీతి సామ్రాజ్యాన్ని నడుపుతూ నీతి వ్యాఖ్యలు చేయడం దాన్ని ప్రజలకోసమని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మీ తోటల్లో ఇళ్లు కట్టించి ఏసీలు పెట్టించి జూదం ఆడించి మేజులు తీసుకుంటున్నావని ఆరోపించారు. మీ ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తూ కోట్ల రూపాయల అక్రమార్జన గడిస్తు న్నావని ఆరోపించారు. తహశీల్దారు సబ్‌రిజిస్ట్రార్ పోలీసులు అవినీతి ఉద్యోగులు కాదా ఎస్ఈబీ వాళ్లే అవినీతి ఉద్యోగులన్నట్లు మాట్లాడటం విడ్డూరంగా వుందన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ వడ్డిబాలుడు టీడీపీ నేతలు గోపవరం లక్ష్మణ్, కట్టమీది మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



వేర్వేరుగా విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు వరద , లింగారెడ్డి

ఎమ్మెల్యే లింగారెడ్డి ఫైర్

ఎస్ఈబీ ఎస్ఐ పైనే దౌర్జన్యానికి దిగితే సామాన్యుల పరిస్థితి ఏమిటని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి పై టీడీపీ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఎస్సైపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇంతకాలం నీ బెదిరింపులకు దాడులకు భయపడి అధికారులు పనులు చేశారు. ఎన్నికలు దగ్గర పడ్డా కూడా ఇంకా మీకు అనుకూలంగా చేయాలని ఎస్సైనే బూతులు తిట్టే స్థాయికి వచ్చావంటే నీ స్థాయి ఏమిటో తెలుస్తుందన్నారు. పోలీసులపై బెదిరింపులు దాడులు జరుగుతుంటే పోలీసు అధికారుల సంఘం ఎందుకు ప్రశ్నించదన్నారు. కేవలం టీడీపీ నేతలు పోలీసులపై ఫిర్యాదు చేయగానే ప్రెస్‌మీట్లు పెట్టే అధికారులు ఎమ్మెల్యే దౌర్జన్యంపై స్పందించలేదెందుకని ప్రశ్నించారు. మీ ప్రభుత్వం పతనం అవుతున్నా ఇంకా మీ దౌర్జన్యాలు ఆగలేద న్నారు. ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని ఎస్పీని ఆయన కోరారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి : ప్రవీణ్ రెడ్డి



మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 12: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంపై దౌర్జన్యం చేసి నిందితుడిని విడిపించుకుపోయిన ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు కంటే ఎక్కువ మద్యం బాటిళ్లు ఉంటే కేసు నమోదు చేయాలని ప్రభుత్వం చట్టం చేసిందని, దీనిపై ఎమ్మెల్యేకు ధైర్యం ఉంటే అసెంబ్లీలో నిలదీయాలన్నారు. చట్టాన్ని ధిక్కరిస్తూ ఎమ్మెల్యే సెబ్ కార్యాలయంపై దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యేకు నాలుగున్నరేళ్ల తర్వాత చట్టంలోని లోపాలు గుర్తుకొచ్చాయని ఎద్దేవా చేశారు. ఎస్పీ అమ్మ మొగుడికి చెప్పుకో అని ఒక జిల్లా స్థాయి అధికారిని కించపరిస్తే ఐపీఎస్ అధికారుల సంఘం, జిల్లా పోలీసులు అసోసియేషన్ నేతలు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. సెబ్ కార్యాలయంపై ఎమ్మెల్యే దౌర్జన్యం చేయడాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఏఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఒకే తాటిపైకి సంక్షేమం - అభివృద్ధి

కొండాపురంలో 60 కుటుంబాలు టీడీపీలో చేరిక ● ఇంటింటికీ టీడీపీ మ్యానిఫెస్టో చేరవేత

బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భూపేశ్‌రెడ్డి, బొజ్జా రోశన్న, ప్రవీణ్ కుమార్ రెడ్డి



భూపేశ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వడ్డెర యువజన సంఘం నేతలు

ఎర్రగుంట్ల, జనవరి 12: టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి ఒకే తాటిపైకి తెచ్చి రాష్ట్రాన్ని అభి వృద్ధి బాటలో నడిపిస్తారని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం వలసపల్లెలో బా బు ష్యూరిటీ-భవిషత్తు గ్యారెంటీలో భాగంగా ఇంటింటికీ వెళ్లి టీడీ పీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ తన ప్రచారాన్ని సాగించా రు. నియోజవర్గంలో తనకు ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభి స్తోందన్నారు. టీడీపీ కార్యకర్తలు మరింత చురగ్గా పాల్గొని పార్టీని అధికారంలోకి తెప్పించేందుకు పెద్దఎత్తున కృషిచేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ మండల ఇన్‌చార్జి సి.జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండల టీడీపీ బాధ్యులు మేకల మోహన్‌రెడ్డి, వలసపల్లె టీడీపీ నేతలు సుదర్శన్‌రెడ్డి, నాగ రాజు, చిన్నవెంకటసుబ్బయ్య, రామాంజనేయులు, పెద్దవెంకటసుబ్బ య్య, కేశవ్,నాగేంద్ర, మురళి, రవి, ఉగయ్య, వెంకటసుబ్బయ్య, నరే శ్, ప్రసాద్, పవన్‌కల్యాన్, రామజి, అంకల్, సుబ్బరాయుడు, సంజీ వ్, రాఘవేంద్రెడ్డి, పట్టణ, దేవగుడి అభిమానులు పాల్గొన్నారు.

60 కుటుంబాలు టీడీపీలో చేరిక

కొండాపురం, జనవరి 12: పట్టణంలో వడ్డెర యువజన సంఘీయులు 60 కుటుంబాలు జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. యువతకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ మెనిఫెస్టో గురించి ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సీ శివనాథరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంభాపురం రమణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ గోరుశెట్టి బాబు, నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, మండల మహిళా టీడీపీ అధ్యక్షురాలు పద్మజ, మాజీ సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి, టీడీపీ నేతలు గండ్లూరు శంకర్‌రెడ్డి, చామల విష్ణువర్ధన్ రెడ్డి, గిరీష్, శివ, సాయి, ఉదయ్‌కుమార్, వడ్డెర యువజన సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములను కాల్చివేయడం దుర్మార్గపు చర్య

తాళ్లప్రొద్దుటూరులో కోమనూతల నరసింహ గడ్డివాములను కాల్చివేయడం దుర్మార్గపు చర్య అని భూపేశ్‌రెడ్డి తెలిపారు. సంఘటన స్థలాన్ని శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కొండాపురం ఎస్ఐ యోగీంద్రకు ఫిర్యాదు చేశారు.

పోరుమామిళ్లలో....

పోరుమామిళ్ల, జనవరి 12: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు రూపొందించిన టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తూ టీడీపీ నేతలు కరపత్రాలు అందించారు. శుక్రవారం బలిజకోటవీధిలో, 9, 10 వార్డుల్లో బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న కరపత్రాలు పంచారు. పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, మండల తెలుగుయువత అధ్యక్షుడు సీతాబాలాజీ, సంచర్ల మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, టీడీపీ నేతలు రామసుబ్బారావు, సీతా వెంకటసుబ్బయ్య, ఇమాంహుసేన్, సెట్టం ప్రతాప్, కరీముల్లా, ఎస్ ఎంబాషా, అన్వర్, వెంకటేశ్వర్లు, ధర్వేష్, నాగరాజ్ పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం రితీష్‌రెడ్డి ఆధ్వర్యంలో సిద్దనకిచ్చాయపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న, మండల పార్టీ అధ్యక్షుడు భైరవ ప్రసాద్, రామసుబ్బారావు, పాణ్యం వెంకటసత్యం, ప్రొఫెసర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో....

ప్రొద్దుటూరు, జనవరి 12: వైసీపీ ఎమ్మెల్యేల దౌర్జన్య కాండతోనే జగన్ ప్రభుత్వం పడిపోతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విజయకుమార్ సర్కిల్లో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గారెంటీ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు విశ్వనాథరెడ్డి తాటి శీను పొట్టిపాటి గంగాధర్ మేరువ మూర్తి సురేంద్ర మజీద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కూడారైవెళ్లి ఉత్సవం



కూడారైవెళ్లి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరుటౌన్, జనవరి 12: పాత మార్కెట్‌లోని లలితాదేవి రతనాల వేంకటేశ్వ రస్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా కూడారైవెళ్లి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున మహిళలు ఆలయం వద్ద ముగ్గులు వేసి దీపాలు వెలిగించారు. శ్రీకృష్ణుడు, గోదాదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. శ్రీకృష్ణుడికి ఇష్టమైన బెల్లం పొంగలిని 108 మట్టి పాత్రల్లో పోసి స్వామివారికి నివేదించారు. అనంతరం తిరుప్పావై పాశురాలను పఠించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం ఉదయం గోదాదేవి, రంగనాయకుల స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు కోరారు.

టీడీపీ ప్రభుత్వంలో రాజోలి ఆనకట్ట నిర్మిస్తాం : పుట్టా



పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

ఖాజీపేట, జనవరి 12: గత ప్రభుత్వాల మాదిరి శంకుస్థాపన చేసి మరచిపోకుండా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజోలి నిర్మాణం చేపడతామని మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం బి.కొత్తపల్లెలో సుబ్బరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి అనుచర వర్గం టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి దాదాపు 50 కుటుంబాలు చేరాయి. రాజోలి నిర్మిస్తే 90 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కేసీ కెనాల్‌కు సాగునీరు రాక రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని, ఇలాంటివి వైసీపీ నేతలకు కనపడవా అన్నారు. ప్రజలకు భయపడే నాయకుడు కావాలని, ప్రజలను భయపెట్టే నాయకున్ని ఇంటికి పంపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కటారి కృష్ణ, ప్రభాకర్‌నాయుడు, జనసేన ఇన్‌చార్జి మల్లోత్ర, ఫరూక్, సుబ్బయ్య, పిచ్చినాయుడు, వెంకటేష్, నాగిశివారెడ్డి, కొత్తపేట బుజ్జి, నరసింహులు, క్రిష్టారెడ్డి, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో అభ్యంతరాలు



అభ్యంతరాలు తెలుపుతున్న క్రీడాకారులు

పోరుమామిళ్ల, జనవరి 12: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో సంచర్ల పంచాయతీ క్రికెట్ క్రీడాకారులు అభ్యంతరాలు తెలి పారు. శుక్రవారం పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రలో భాగంగా గానుగపెంట, నాగలకుంట్ల సచివాలయాలు పాల్గొన్నాయి. గానుగపెంట క్రీడాకారులు ఇద్దరు కొత్తవారిని ఏర్పాటు చేసుకున్నారని తెలి యడంతో నాగలకుంట్ల క్రీడాకారులు అభ్యంతరం చేశారు. దీంతో నాలుగున్నర గంటల వరకు పంజాయితీలోనే సరి పోయింది. నేతలు, అధికారులు సర్ది చెప్పడంతో క్రీడాకారులు శాంతించారు. నాగలకుంట్ల సచివాలయం క్రీడాకారులు విజయం సాధించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

పోరుమామిళ్ల, జనవరి 12: ముసల్‌రెడ్డిపల్లె పంచాయతీలో పది కుటుంబీకులు టీడీపీనేత రితీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. శుక్రవారం సాయంత్రం ముసల్‌రెడ్డిపల్లె చంద్రమౌళిరెడ్డి, శ్రీరాములు, నారాయణ, నాగేంద్ర, సగిలి దేవదాస్, థామస్, రామయ్య, కె.పెద్దగురయ్య, నారాయణరెడ్డి టీడీపీలో చేరారు. బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న, మండల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, టీడీపీ నేతలు రామసుబ్బారావు, ఇమాం హుసేన్, తెలుగుయువత అధ్యక్షుడు సీతాబాలాజీ, సంచర్ల మాజీ సర్పంచ్ సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న వెల్లాలో పార్వేట

రాజుపాలెం, జనవరి 12: మకర సంక్రాంతిని పురస్కరించుకుని వెల్లాల పుణ్యక్షేత్రంలో పార్వేట ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నరసయ్య తెలిపారు. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి హనుమద్ వాహనం, నంది వాహనంపై గంగాపార్వతీ సమేత భీమలింగేశ్వర స్వామి పార్వేట ఉత్సవం నిర్వహిస్తారు. సోమవారం వెల్లాలలో మొదలైన ఈ పార్వేట గోపాయపల్లె, చాగలమర్రి మండలం మల్లెవేముల, రాజుపాలెం మండలం లోని దద్దనాల, పగిడాల, కుమ్మరపల్లె, కల్లపాడు గ్రామాల్లో ఉత్సవం జరుగుతుంది. కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఆయా గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని ప్రకటనలో తెలిపారు.